

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ప్రకటనలు

**ఈ టీ.వీలో ప్రకటనలు వస్తుంటే** నా గుండెలు గుబగుబలాడ్తున్నాయి. మొన్నామధ్య నేను ఏదో రాసుకుంటూ, యధాలాపంగా మా ఆయన వైపు చూసేసరికి ఎంతో శ్రద్ధగా బుద్ధిమంతుడైన విద్యార్థిలా టీ.వీ వైపే చూస్తూ కనిపించారు. నేను నా కిష్టమైన 'గ్రేస్ ఎనాటమీ'నో 'బిగ్ బాసో' చూస్తుంటే, గట్టిగా విజిల్‌తో పాట పాడీ, ఏ ఏ.సీ నో విప్పి, బరబరా శబ్దం అయ్యేట్లు రిపేర్ చేస్తూ నా దృష్టిని ఆకర్షించడానికి తాపత్రయ పడుతుంటారు. అసలు ఆయనకి ఇష్టమైన ఛానెల్ ఎదైనా ఒకటి ఉందా అన్నది నాకు ఎప్పటికీ సందేహమే. క్రికెట్ మ్యాచ్ అప్పుడూ, అసెంబ్లీ సమావేశాలప్పుడూ మాత్రం చాలా ఇంట్రెస్టుగా పెద్దగా నవ్వుతూ, అప్పుడప్పుడూ 'హుర్రే' అని అరుస్తూ టీ.వీ చూస్తారు.

ఆ తర్వాత ఓ సినిమా కానీ, సీరియల్ కానీ, పాట కానీ, ఆట కానీ ఆయన శ్రద్ధగా చూడడం నేను చూసిన పాపాన పోలేదు.

మా డాక్టర్ పద్మ "ఈ రోజు ఉత్తేజ్ ఫోన్ చేసాడు, కన్యాశుల్కం నాటకం, రవీంద్రభారతిలో, బావగారిని కూడా తీసుకురా అక్కా" అంది ఓసారి.

"ఆయన ఔరంగజేబులే పద్మా" అన్నాను.

"అంటే?" అని అడిగింది.

"మీ బావగారికి కళలంటే ఒంటికి పెద్దగా పడవులే. అందుకే ఔరంగజేబు." అంటే ఎంతసేపో నవ్వింది.

ఇంకోసారి మా ఫ్రెండ్ "మీ ఆయన ఏంటే ఎగ్జిబిషన్‌లో మనని వదిలేసి అంత ఫాస్ట్‌గా నడుస్తున్నాడు?" అంటే

"ఆయన అంగళ్ళు ఉన్న చోట అంగదుడులే" అన్నాను.

"అంటే?" అంది క్వశ్చన్ మార్కు మొహంతో.

"షాప్‌లోకి పెళ్ళాం వెళ్తుంటే చాలు పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ జనంలో కలిసిపోయి అంగదుడు అయిపోతారు మగాళ్ళు" అన్నాను.

అది ఇప్పటికీ అందరితో ఈ మాట చెప్పి నవ్వుతుందిట.

ఇంతకీ ఈ పూట మా పిల్లల తండ్రి ఏం చేస్తున్నాడా అని కుతూహలంగా వెళ్ళి చూసా. ఓ రేకు ముక్కకి కింద 'ఎల్' ఆకారంలో ఓ రాడ్ వంచి, వెల్డింగ్ చేయించిన టేబుల్, పదహారు రకాలుగా వంచి "ఇది మీ లాప్ టేబుల్ గానూ, అవసరమైతే ఇస్త్రీ చేసుకోడానికీ, మీరు మంచాన పడితే, దగ్గరకి లాక్కుని దీని మీద టబ్ పెట్టుకుని మొహం కడుక్కోడానికీ, ఒళ్ళు బాగా బరువై, ఉన్నచోటే మింగడానికి

దీనిమీద టిఫిన్లూ, భోజనం చెయ్యడానికీ, పోతే తల దగ్గర దీపం పెట్టుకోడానికీ..'' టైప్‌లో ఆ రేకుముక్కని రకరకాలుగా ఎలా ఉపయోగించవచ్చో చెపుతూ ''కేవలం మూడువేలా తొమ్మిది వందల తొంభై తొమ్మిది రూపాయిలు మాత్రమే! ఇంత చవకగా దొరకడం మీ అదృష్టం'' అంటూ మూతీ, ముక్కూ అక్కర లేనంతగా చేతులూ తిప్పుతూ ఉన్న శ్వేత జాతీయురాలు ప్రకటన ఇస్తోంది.

మా అమ్మే గనక చూస్తే ''చూడు అమెరికా పిల్ల అయినా ఎంత ధారాళంగా తెలుగు మాట్లాడేస్తోందో!'' అని మురిసిపోయేది.

ఆ దిక్కుమాలిన వాణిజ్య ప్రకటన ఇంత తల తిప్పకుండా చూస్తున్న ఆయన్ని ఏవైనా అందామా అని నోరు తెరిచి పోనీలే ఏ తెలుగు సినిమానో చూస్తే ప్రతి డైలాగ్‌కీ ఆ సినిమా నేనే తీసినట్లు ''ఇదిగో విను... చూడు.. ఇంత ఛండాలంగా ఎందుకు తీస్తారు మీ వాళ్ళు?'' అంటూ ఆ నిర్మాత, డైరెక్టరూ మా మేనత్త కొడుకులో, మేనమామ కొడుకులో అయినట్లు హేళన చేస్తారని తెరిచిన నోరు మూసేసి వచ్చి కౌముదికి కాలం రాసుకుంటూ కూర్చున్నాను.

ఇంతలో తలుపు టకటకా చప్పుడైంది. తీసి చూస్తును కదా! నెత్తిమీద ఆ బల్ల ఇందాక నేను టీ.వీలో చూసినది పెట్టుకుని ఓ ఆగంతకుడు నిలబడి ఉన్నాడు.

అల్లావుద్దీన్ అద్భుతదీపం కానీ మా బాకర్‌కి దొరకలేదు కదా! అలా మనసుపడ్డాడు ఇలా ప్రత్యక్షం అయిందని నోరు పూర్తిగా తెరిచి ఉండిపోయాను. అప్పుడప్పుడూ మా ప్రభాకర్‌ని 'బాకర్' అని సంబోధించడం నాకు అలవాటు. (ఎందుకంటే చిన్నప్పుడు మా రిసాలాగెడ్డమీద ఓ గూండా ఇదే పేరుతో అఫ్తాలు వసూలు చేస్తూ ఉండేవాడు. అతనంటే నాకు గొప్ప ఎడ్మిరేషన్ ఉండేది. అతనికి ఓ సైకిల్ స్టాండ్ కూడా ఉండేది. నాకు మాత్రం తొక్కుకోడానికి సైకిల్ ఫ్రీగా ఇస్తుండేవాడు.)

''మీ డోర్ నెంబర్ ఇదేనా? వీధి పేరు ఇదేనా? మీ వారి పేరూ?'' అని అతను అడుగుతుంటే,

''ఆ కౌండిన్య గోత్రం.. ఎందుకూ?'' అని అడిగాను.

''ఇందాక ఈ టేబుల్ ఆర్డరిచ్చారుగా.. తెచ్చాం. మాది చాలా క్విక్ సర్వీస్'' అన్నాడతను.

''బకరాలు ఎవరు దొరుకుతారా? అని ప్రతి సందు చివరా మీ మనుషులు ఈ బల్లలు నెత్తిన పెట్టుకుని కూర్చున్నారా? ఇంత తొందరగా రావడమేమిటి నా తద్దినం కాకపోతేనూ'' అన్నాను. నాలుగువేలకి ఆ రేకు కొన్నారంటే నా ఒళ్ళు మండిపోయింది.

''ఇంతకు ముందు ఆర్డర్ ఇచ్చిన నాలుగు గంటల తర్వాత వెళితే, ఆ ఇంటి యజమాని మనసు మారిపోయిందమ్మా! అందుకే గంటలో పిజ్జా డెలివరీలా వచ్చేస్తున్నాం'' అన్నాడు.

ఇంతలో ''వచ్చాడా... వచ్చాడా? వండర్‌ఫుల్. ఇండియాలో ఇలాంటి పంక్చువాలిటీ ఎక్కడా చూడలేదు'' అని మా బోళా శంకరుడు, ఉబ్బి తబ్బిబ్బు అయిపోతూ ''మంచినీళ్ళూ, కాఫీ తీసుకురా'' అన్నారు నా వైపు చూసి.

పెళ్ళాం తరఫు బంధువులొస్తే, ఆవలించి, కళ్ళు చిట్లించే ఈయన ఇలాంటి వాళ్ళు వస్తే ఆత్మబంధువులొచ్చినట్లు మర్యాద చేస్తారు.

''ఇప్పుడు ఇది ఎందుకండీ? గట్టిగా దానిమీద నేతి గిన్నె పెడితే రేకు ఒంకర పోయేట్లుంది'' అన్నాను మర్యాదరామన్నని రెక్క పట్టి పక్కకి లాగి.

''ఛ. వింటాడు. నువ్వు కాఫీ తీసుకురా. ఎంత ఉపయోగమో నీకు తర్వాత తెలుస్తుందిలే'' అని డబ్బులు తేవడానికి గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత నేను చూస్తుండగా, దాని మీద టిఫిన్ తినీ, అవసరం లేకపోయినా నాలుగు కాయితాలు వేసుకుని కూర్చుని, ఏదో రాసి, లాప్‌టాప్ పెట్టి నేను చూస్తున్నానా లేదా అని క్రీగంట గమనిస్తూ కాటమరాయుడి వేషాలు చాలా వేసారు.

ఇంకో ఆదివారం ''ఏమోయ్ ఆకలేస్తోంది ఉప్మా చేస్తావా?'' అన్నారు.

బతికించారు. ఆలూ బోండా చెయ్యి, పెసరట్టు వెయ్యి అనలేదు అని వంటగదిలోకి నడిచి కత్తిపీటా ఉల్లిపాయలూ తీసుకునే లోపలే "ఛ! ఆ కత్తిపీట అవతల పారెయ్. ఇదిగో ఇది చూడు" అని ఓ తెల్లడబ్బా, దానిమీద ఎలకని పట్టే బోనులాంటి గిన్నే చూపించి

"ఉల్లిపాయపొట్టు తీసి, రెండు ముక్కలు చేసి, ఈ వై గిన్నెలో ఉంచి నొక్కితే కింద చక్రంలో పొట్టులా పడుతుంది. ఎంత చవకో తెలుసా? ఎనిమిది వందల తొంభై తొమ్మిది రూపాయలు మాత్రమే" అన్నారు.

"ఏంటీ? ఉల్లిపాయ తరుక్కోడానికి ఇంత డబ్బా? ఈ డబ్బా తెలివి తేటలు మీకు ఎక్కడనుండీ వస్తున్నాయీ?" అని లబలబలాడాను. ఆ కట్టర్‌తో ఉల్లిపాయ తరిగాకా, దాన్ని సర్ఫ్ నీళ్ళతో శుభ్రం చెయ్యకపోతే ఎలుకలు చచ్చిన వాసన. దాన్ని వేడినీళ్ళలో సర్ఫ్ వేసి కడిగి, ఎండలో పెట్టి పొడి బట్టతో తుడవాలట. మా రామలింగడు బోధించాడు. నిముషంలో ఉల్లిపాయ తరుక్కునే నాకు అరగంట పని.

"ఇదీ టీ.వీలోనే చూపించారా?" అడిగాను.

"యా!" చక్రధారిలా కళ్ళు చక్రాల్లా తిప్పారు.

ఆ తరువాత నుండీ నేను టీ.వీల్లో ప్రకటనలొస్తుంటే భయపడి ఛస్తున్నాను. అవి చూసి, ఈయన ఆ ఫోన్ నెంబర్‌కి డయల్ చేసి మిస్డ్ కాల్ ఇస్తే చాలుట. ఫోన్ కూడా చెయ్యక్కరలేదుట. తెలివి మీరిపోయారు వ్యాపారస్తులు. వీళ్ళిల్లు నేలకొట్టా!

కోట్లకి కోట్లు పోసి సినిమాలు తీసి, "ఫలానా సినిమా చూడండి.. నేడేచూడండి" అంటే నమ్మడం లేదు కానీ టీ.వీ.ల్లో "ఈ లక్ష్మీ యంత్రం కొనండి. సాయంత్రానికి మీ దూరపు బంధువు మీ పేరు మీద తన కోట్ల ఆస్తి రాసి అంతు తెలీని రోగంతో పోతాడు" అంటే, వెంటనే ఎగబడి క్రెడిట్ కార్డు గీసి నెట్ ద్వారా ఆ యంత్రం కొంటారు. ఈ 'నెట్' అనేది నిజంగా **'వలే!'** ఆన్‌లైన్ షాపింగ్ లొచ్చాక, ఇంట్లోంచి కదలక్కరలేకుండా చాలామంది దుస్తులూ, ఎలక్ట్రానిక్ పరికరాలూ, షూస్, వంటింటి పరికరాలూ తెప్పించేసుకుంటున్నారు. "నేను సెల్‌ఫోన్‌లోనే షాపింగ్ చేస్తాను" అని చెప్పుకోవడం చాలా ఫ్యాషన్ అయిపోయింది. ఒకవేళ ఆ కొరియర్‌లో వచ్చిన బట్టలు పొట్టివైపోతేనో, ఎలక్ట్రానిక్ పరికరాలు పనిచెయ్యకపోతేనో అని నేను అడిగితే, 'బీ.సీ' కాలం దాన్ని చూసినట్లు చూస్తారు మా ఆయన నన్ను.

ఈ మధ్య మా బుచ్చిబాబు పదిరోజులు శలవు పెట్టి ఇంటి పట్టునున్నారు.

"మమ్మీ.. వెంటనే టీ.వీ కట్టెయ్యి లేదా కేబుల్ వాడికి ఫోన్ చేసి ట్రాన్స్ మిషన్ ఆపించెయ్" అని మా పెద్దాడు గగ్గోలు పెట్టాడు. చపాతీ పిండి కలుపుతున్న నేను ఆ చేతులతోటే వెళ్ళి చూద్దును కదా, టీ.వీలో ఒక గుండ్రటి వీల్ మీద పొట్ట ఆన్చి గిరగిరా తిరుగుతున్న అమ్మాయిని చూపిస్తున్నారు. ఆ జపాన్ అమ్మాయి, చిన్ని చిన్ని కళ్ళు మూసి, పెద్ద పెద్ద పళ్ళతో నవ్వుతూ "ఇంక మీ శరీరాకృతి లతలా సన్నగా సాగుతుంది.. ఎవరీ మెరుపు తీగా అంటారు" అని స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడేస్తోంది. మా ఆయన ఫోన్‌లో సీరియస్‌గా ఏదో నెంబర్ డయల్ చేస్తున్నారు.

"ఏం చేస్తున్నారండీ?" అని అరిచాను.

"చీరలకి వేలకి వేలు తగలేస్తావు. స్లిమ్ మిషనట.. ఇది ఆర్డర్ ఇస్తున్నాను. అది వచ్చాక వాడితే సన్నబడతావు" అన్నారు.

నన్ను నేను ఆ చక్రం మీద గిరగిరా విఠలాచార్య సినిమాలో రాజకుమార్తెలా తిరగడం ఊహించుకుంటూ ఉండగానే, కరెంట్ పోయి టీ.వీ ఆఫ్ అయింది. కింద మా వాడు మెయిన్ ఆఫ్ చేసి ఉంటాడని నాకు అర్ధమయింది. చిన్నప్పటినుండీ షెర్లాక్ హోమ్స్, పీ.జీ.ఉడ్ హౌస్ బుక్స్ వాడి చేత చదివించినందుకు ఆనందంగా ఫీల్ అయ్యాను.

"ఛ! టైంకి పోతుంది వెధవ కరెంట్" అన్నారు మావారు ఆశాభంగంగా.

ఓ వేసవికాలం మధ్యాహ్నం హాయిగా కందిపచ్చడీ, ముక్కలపులుసూ, కాకరకయ కూరా వేసుకుని తిని, సరదాగా చిలకలు చుట్టి ఇస్తుంటే, చిలక కబుర్లు చెపుతున్న మా ఆయన "అంకుల్.. మే ఐ కమిన్?" అని ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి లోపలికి రాగానే "ఎస్.. కమిన్.. కమిన్" అంటూ లేచి హడావిడి పడి, నా వైపు చూసారు. మర్యాద రామన్న చూపుకి అర్ధం తెలిసి నేను మంచినీళ్ళూ, కాఫీ తేవడానికి లోపలికి వెళ్ళాను.

నేను డికాషన్ వేసి, అది దిగి పాలు వెచ్చపెట్టి కాఫీ తెచ్చేసరికి, ఈయనతో ఆ పిల్ల కిలకిలా నవ్వుతూ కబుర్లు చెపుతోంది. ఈయన చేతిలో ఓ చేప లాంటి ప్లాస్టిక్ పరికరం, దానికి వైరూ ఉన్నాయి.

"ఏమోయ్.. ఇది ప్లగ్‌లో పెట్టి కాసేపు ఈ మిషన్, కాళ్ళమీద రాసుకుంటే చాలు. ఆ కరెంట్‌కి కాళ్ళ నొప్పులు తగ్గిపోతాయి. వీపూ, చేతులూ, పొట్టా, ఏదైనా సరే ఇలా నాలుగుసార్లు క్లాక్ వైజ్‌గా, ఏంటీ క్లాక్ వైజ్‌గా తిప్పితే చాలు నొప్పులు మటుమాయం!" అన్నారు.

"అంతేనా? ఎలక్ట్రిక్ చైర్‌లో కూర్చుంటే మనిషే మటుమాయం అవుతాడు. పీడాపోతుంది" అన్నాను.

"పాపం అమ్మాయి ఎం.బి.ఏ చదువుకుంటోందిట. ఇది పదిహేను వందలు ఇలాంటివి పది అమ్మితే వెయ్యిరూపాయలు వస్తాయట. అది మెస్‌కి కడుతుందిట" అన్నారు పరోపకారి పాపన్న.

నేను పాపన్న వైపూ, ఆ అమ్మాయి వైపూ మిర్రి మిర్రి చూసి "పదిహేను వందలే? నాకే నెప్పులూ లేవు.. కాఫీ తాగి వెళ్ళిరా అమ్మా" అన్నాను.

"అసలు రెండువేలు మేడం. అంకుల్‌కి కన్‌సెషన్ ఇచ్చా. ఫైవ్ హండ్రెడ్ హీ ఈజ్ సో స్వీట్" అంది.

"విజయా డయాగ్నస్టిక్స్ లా చక్కగా చెప్పావు కానీ.. మాకు అక్కర్లేదులే" అన్నాను.

"అంకుల్ మనీ ఇచ్చేసారు. మీతో మాట్లాడలేదనీ వెయిట్ చేసాను" అంది ఆ అమ్మణి.

"పాపం మీ అమ్మ వీపు నొప్పి అంటోంది ఆవిడ్ని కూడా వాడమను" అన్నాడు మా సంబరాల రాంబాబు.



కొమ్మనాపల్లి గణపతిరావుగారితో

నాకు నవ్వొచ్చింది. కొమ్మనాపల్లి గణపతిరావుగారి కథల్లో, కంటినుండి కారే కన్నీటి చుక్క మధ్యలో బుగ్గ మీద ఆగి "నానీ.. నేను వెళ్ళిపోతున్నానని దిగులు పడకు. ఎడారిలో ఇంకిపోయిన వర్షపు చినుకు, మొలకై మానై మళ్ళీ ఎదిగినట్లు, నీ తడిసిన గుండెలో భావ వీచికకై ఉత్తుంగ తరంగమై నిర్మల నిర్భర నిర్యుక్త నిర్ఝరీ.. రజ్జుల సజ్జుల ఉచ్చకుప్పిల కర్ణరీ కర్జవనమై.." అంటూ ఏదో అరగంట సేపు చెప్పి వెళ్తుండేది. అలా ఆ నైరాశ్యపు చిరునవ్వు నాకు ఎంతో చెప్పింది.

నువ్వు కాఫీ పెట్టడానికి వెళ్ళకపోయినా, ఆపిన ఈ ఖర్చు ఆగేది కాదు.

"అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేవు" టైప్‌లో ఆన్‌లైన్, మొబైల్, హోమ్ డెలవరీ షాపింగ్‌లని ఈ దానవీరశూరకర్ణ నుండి దూరం చెయ్యలేవని దాని భావం.

ఇదే మనిషి నేను ఏ వ్రతానికో తువ్వాళ్ళు కొనడానికి వెళ్ళి, మనసుపడి ఓ పట్టుచీర కొనుక్కుంటే, బడ్జెట్ పద్మనాభం అయిపోతారు. ఆడవాళ్ళూ - అనవసరపు ఖర్చు అంటూ పుంఖాను పుంఖాలుగా స్పీచ్‌లిస్తారు.

మా పెద్దమ్మగారు ఆటోవాడు "మీటర్ అరవై అయింది. మీటర్ మీద ముప్పై ఎక్స్‌ట్రా ఇవ్వండి" అంటే,

వందరూపాయలు ఖర్చు పెట్టి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి కంప్లైంట్ ఇచ్చి వస్తుండేది. ఆవిడకి జీవితాంతం ఆటో వాళ్ళతో గొడవే. అలా నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడే వాళ్ళు డబ్బుల కోసం చూసుకోరు.


పదహారు ఉపయోగాల టేబుల్, నొప్పుల చేప మెషిన్, ఉల్లిపాయ కట్టర్

"నేను ఇంట్లో కూర్చుని ఆర్డర్ ఇచ్చి కొనడం వల్ల ఎంత ఫ్యుయల్ ఆదా అవుతోందో, ఎంత టైం కలిసి వస్తోందో మీ అమ్మకి తెలీదు. చెప్పులు కొనడానికి అరడజన్ షాపులు తిరిగితేనే ఆడవాళ్ళకి తృప్తి" అంటారు పిల్లలతో మా ఆయన.

కానీ ఆయన కొన్న వస్తువులు వల్ల ఎవరికి ఉపయోగం అని తర్వాత ఆలోచించరు.

కాళ్ళనొప్పికి నేను టాబ్లెట్స్ మింగాను కానీ - ఆ చేప మిషన్ ఎన్నడూ వాడలేదు.

నేను కడుపుమీద లాప్‌టాప్ పెట్టుకుని మెయిల్స్ చూసుకుంటాను కానీ, ఆయన కొన్న రేకుబల్ల ఎప్పుడూ వాడలేదు.

ఉల్లిపాయ కట్టర్‌ని బోర్లావేసి, బొమ్మరిల్లులా పెట్టుకుని పనిమనిషి కూతురు ఆడుకుంటోంది.

టోస్టర్, పెర్కొలేటరూ, వాక్యూమ్ క్లీనరూ స్టోర్ రూంలో అలంకరణ సామాగ్రిలయ్యాయి.

ఏమైనా టీ.వీల్లో ప్రకటనలు ఇచ్చే వ్యాపారస్తులకి మాత్రం అద్భుతమైన తెలివి తేటలు.

పదిరూపాయల చీపురునీ, నలభై రూపాయల బూజు కర్రని కూడా కేవలం "తొమ్మిది వందల తొంభై తొమ్మిది రూపాయిలు మాత్రమే. కేవలం ఒక్క ఫోన్ కాల్‌తో మీ వాకిట్లో సిద్ధం" అంటూ అంటగట్టెయ్యగలరు.

ఈ బొచ్చె టీ.వీ.లు (డిష్ టీ.వీలు) వచ్చినప్పటినుండీ టీ.వీలో కేవలం ప్రకటనలు మాత్రమే వచ్చే ఛానెళ్ళు ఎక్కువయిపోయాయి. ... ఆగండి.. మా రమణీకాంతుడు మళ్ళీ టీ.వీ చూస్తున్నాడు ... నే వెళ్ళాలి.

Post your comments

